# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు
ఎన్.ఖీమ్యానాయక్, పూజారి గౌతమి

కలెక్టరేట్, డిసెంబర్ 18: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు ఎన్.ఖీమ్యానాయక్, పి.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన 20 ఫిర్యాదులను, వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తూ లిఖితపూర్వక వివరణ అందజేయాలన్నారు. కాగా సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ శాఖ-10, ఈఈ ఎంబీ -1, సిరిసిల్ల మున్సిపల్-3, డీఆర్‌డీవో -1, ఎంప్లాయ్‌మెంట్-2, డీ ఎంహెచ్‌వో -1, డీపీవో -1, వేములవాడ మున్సిపల్‌కు ఒకటి మొత్తం 20 దరఖాస్తులు వచ్చాయి. అలాగే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.గౌతమిని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్ష లు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపకలెక్టర్ బొద్దుల గంగయ్య, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఎన్.ఖీమ్యానాయక్

## గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాకూర్‌పల్లిని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి. బాకూర్‌పల్లిలో జనాభా సుమారు 438 మంది ఉన్నారు. తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కేంద్రం నుంచి మా గ్రామానికి దూరం ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది అవుతుంది. దీంతో మా గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా మార్చాలి.

- పి.రవీందర్, రాచర్లతిమ్మాపూర్

## ఉపాధి కల్పించాలి



ఎస్టీ లంబాడ కులానికి చెందిన తనకు ఏదైనా ప్రైవేటు ఉద్యోగం కల్పించాలి. మా అన్న విద్యుదాఘాతంతో మృతి చెందాడు. దీంతో కుటుంబపోషణ కష్టమవుతున్నది. మా కుటుంబానికి ఏదైనా ఉపాధి చూపాలి.

- భూక్యా అశోక్, వట్టిమల్ల, కోనరావుపేట మండలం

## ఇంటి వద్ద ఉన్న దారిని పునరుద్ధరించాలి



మేం, మరో ఆరు కుటుంబాలు నివసిస్తున్న ఇండ్ల వద్దకు ఉన్న రోడ్డును పునరుద్ధరించాలి. గుండం చంద్రయ్య అనే వ్యక్తి వద్ద దారి కోసం ఒక గుంట స్థలాన్ని గతంలో మేమందరం కలిసి కొనుగోలు చేశాం. ఇపుడు ఆ తోవ తనదే అని మూసి వేశాడు. కాగా ఈ విషయమై గతంలోనే జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. సమస్య పరిష్కారమయ్యేలా చూడాలి.

- బూర భూమయ్య, చంద్రగిరి, వేములవాడ మండలం

## మంత్రి పొన్నంకు రాజన్న ప్రసాదం అందజేత


పొన్నం ప్రభాకర్‌కు సచివాలయంలో రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబర్ 18: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. పొన్నం బాధ్యతల స్వీకరించిన అనంతరం స్వామి వారి కండువాతో సత్కరించి, రాజన్న స్వామివారి ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా సుబ్రహ్మణ్యషష్ఠి వేడుకలు

వేములవాడ టౌన్, డిసెంబర్ 18: వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం సుబ్రహ్మణ్య స్వామివారికి అభిషేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపన్నగారి శివప్రసాద్, గణేశ్, చర్లపల్లి కార్తీక్, అనువంశిక అర్చకులు సంకేపల్లి వాగీశ్ తదితరులు పాల్గొన్నారు.


సుబ్రహ్మణ్యస్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## ప్రభుత్వ పథకాలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

గంభీరావుపేట, డిసెంబర్ 18: మండలంలోని లింగన్నపేట గ్రామ పంచాయతీ ఆవరణలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలపై సోమవారం గ్రామస్తులకు ఫ్లకార్డులతో అధికారులు అవగాహన కల్పించారు. భార త్ వికసిత్ సంకల్ప యాత్రలో భాగంగా అధికారులు కేంద్రప్రభుత్వం అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలపై వీడియో ద్వారా అవగాహన కల్పించారు. స్వచ్ఛ భారత్, నేషనల్ ఇంపార్టెన్స్, శానిటేషన్ ఆయా విభాగాలపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, ఉపన్యాసం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రాజశేఖర్, ఉపసర్పంచ్ దుబాసి రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ మనోహర్, ఏపీవో అరుణ ఉన్నారు.

## రాజన్నను దర్శించుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే

వేములవాడ టౌన్, డిసెంబర్ 18: వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారిని సోమవారం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో వారికి అర్చకులు పూజలు నిర్వహించారు. అన ంతరం నాగిరెడ్డిమండపంలో అర్చకులు ఆశీర్వచనం చేయగా, వారికి ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట గొట్టం గిరి ఉన్నారు.

## కాలినడకన రాజన్న చెంతకు..

వేములవాడ టౌన్, డిసెంబర్ 18: రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వేములవాడ రాజన్నకు రేవంత్‌రెడ్డి టీమ్ ముఖ్య సభ్యుడు ఈశ్వర్ సోమవారం కరీంనగర్ నుంచి వేములవాడ వరకు కాలినడకన వచ్చి తన మొక్కు చెల్లించుకున్నారు. రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఈశ్వర్ ఈ మొక్కు మొక్కుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో ఈశ్వర్‌కు ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 18: పట్టణంలోని 33కేవీ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా నేడు (మంగళవారం) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్, శ్రీనగర్, రాళ్లబావి, అంబేద్కర్ నగర్, సుభాష్‌నగర్, విద్యానగర్, గాంధీనగర్, మార్కండేయ వీధి, మేయర్ నగర్, పాత బస్టాండ్, రగుడు, కలెక్టరేట్ ఏరియా, రెడ్డి వాడ, పెద్ద బజార్, గీతానగర్, అసిఫాపూర్, అటోనగర్, కోర్టు ఏరియా, సిద్దుల వాడ, సుందరయ్యనగర్, శివనగర్, పద్మనగర్, అంబికానగర్, జేపీనగర్, వెంకంపేట, అనంత్‌నగర్, అశోక్‌నగర్, సర్దార్ నగర్, సంజీవయ్యనగర్ రాజీవ్‌నగర్, ముష్టిపల్లి, బోనాల, చంద్రంపేటలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## మొబైల్ అందజేత

వేములవాడ రూరల్, డిసెంబర్ 18: వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో పట్టుకొని బాధితులకు అందజేసినట్లు వేములవాడ రూరల్ ఎస్ మారుతి పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం రామన్నపల్లికి చెందిన తిరుపతి తన ఫోన్‌ను పోగొట్టుకోగా టెక్నాలజీతో ఫోన్‌ను కనిపెట్టి అందజేశామన్నారు. వేములవాడ రూరల్ పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

# తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా శోభాయాత్ర

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 18: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్లలో అయోధ్య రాముడి అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక చంద్రంపేటలోని హనుమాన్ ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమై పాత బస్టాండ్‌లోని వైశ్య భవన్, పెద్ద బజార్, గాంధీ చౌక్ మీదుగా భీమవయ్యనగర్ హనుమాన్ ఆలయం వరకు కొనసాగింది. శోభాయాత్రలో భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు

# సమస్యల పరిష్కారానికి సహకరించాలి

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి

రుద్రంగి, డిసెంబర్ 18: మండల పరిషత్ సాధారణ సర్వసభ సమావేశంలో చర్చించిన సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ గంగం స్వరూపారాణి సూచించారు. సోమవారం రుద్రంగి మండల కేంద్రంలో ఎంపీపీ గంగం స్వరూపారాణి ఆధ్వర్యంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలోని ఎజెండా అంశాలను శాఖల వారీగా వి వరించగా రెవెన్యూ అధికారులు సభకు తెలుపగా మ ండల కేంద్రంలో ప్రభుత్వ దవాఖానకు స్థలం కేటాయించాలని, సర్వేయర్ సమస్య పరిష్కరించాలని, ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఎంపీపీ ఆదేశించారు. ఉన్నత అధికారుల సహకారంతో ప్రభుత్వ స్థలాలు ఎంపిక చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ సభకు తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులకు రెవె న్యూ అధికారులు సహకరించాలని సూచించారు. బాలింతలు, చిన్నారులు, గర్భిణులతో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని, పోషకాహారం అందేలా చూడాలని కోరారు. మాజీ ఎమ్మె ల్యే రమేశ్‌బాబు ఆధ్వర్యంలో మండలంలో చాలా అభివృద్ధి పనులు జరిగాయని, నూతన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో మండలంలోని సమస్యలు పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పీసరి చిన్నభూమయ్య, ఎంపీడీవో శంకర్, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ గంగం స్వరూపారాణి

## ఎంపీపీ భర్తను పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్


రమేశ్‌ను పరామర్శిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి

చందుర్తి, డిసెంబర్ 18: ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చందుర్తి మండలం ఎంపీపీ బైరగోని లావణ్య భర్త రమేశ్‌ను సోమవారం వేములవాడ ఏరియా దవాఖానలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాల కొండ అరుణారాఘవరెడ్డి పరామర్శించారు. ప్రమాద తీరును అడిగి కోలుకునే వరకు విశ్రాంతి వారికి తీసుకోవాలని సూచించారు.

## కుక్క దాడిలో ఆరుగురికి గాయాలు

చందుర్తి, డిసెంబర్ 18: కుక్క రెండు గ్రామాల్లో స్వైర విహారం చేసి ఆరుగురిని తీవ్రంగా గాయపరిచిన ఘటన మండల కేంద్రంతో పాటు మల్యాల గ్రామంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బత్తుల దాన్వాల్, దేవయ్య, కృష్ణంరాజు, మల్యాల గ్రామానికి చెందిన రొండి ఎల్లయ్య, లక్కే బాబుపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారిని చికిత్స కోసం అంబులెన్స్‌లో వేములవాడలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.